# చెంగటనే దేవుడు



కొత్త పెండ్లికొడుకు బాసికం కట్టుకున్నట్టుగా నాలుగో అయిదో నక్షత్రాలను ముఖానికి వేలాడగట్టుకొనింది. నేలమీద మోపుగా కాలూనింది. నింగి కెగిరే ప్రయత్నంలో కాలాన్ని ఒడిసి పిడికిట పట్టుకొనింది. ఆ కాలాన్ని చాలా జాగ్రత్తగా డబ్బుగా మార్చుకునే కృషిలో బలే ఖుషీలో ఉందా హోటల్. ఆ హోటల్లో నూటికి పైబడిన గదులు. ఆగదుల్లో ఒకానొక గదిలో నన్ను కూర్చోమని ఒక కుర్చీ చూపించి వాడు నిలవుటద్దం ముందు నిలబడుకొన్నాడు.

ఆ గదిలో నునులేత ఆకుపై వాలిన లేయెండలా పల్చని వెలుతురు. ఆ వెలుతురును చీల్చుకుంటూ ఆ గదిలో తిరుగుతూ నా చూపులు.

నేను కూర్చున్న కుర్చీకి ఎదురుగా చాలా అందమైన టీపాయ్. ఆ టీపాయ్‌కి అటువైపున నగిషీలు చెక్కిన కుర్చీ. నేను కూర్చున్న కుర్చీకి సమవుజ్జీగా దక్షిణపు వైపు గోడమీద కప్‌బోర్డ్. దాని పక్కనే కలర్ టీవీ. పడమటి వైపు గోడను అందంగా రూపులు దిద్దే ప్రయత్నంలో దారు కళాఖండాలు. అక్కడే గూటిలో ఒదిగిన గువ్వలా టెలిఫోన్. గది మధ్యలో రెండు

పట్టెమంచాలు. ఆ మంచాల మీద మెత్తని పరుపులు, దిండ్లు. అధునాతనంగా అలంకరించబడిన ఆ గదిలో వీటన్నిటినీ వెక్కిరిస్తున్నట్టుగా మూడు చక్రాల తోపుడు బండి– ఒకమూల ఆ గదికి దిష్టి చుక్కలా.

ఆ తోపుడు బండిని చూస్తూ నా ముఖం ప్రశ్నార్థకమయింది. సమాధానం దొరకలేదు. అదే ఆలోచిస్తూ వాడివైపు తిరిగాను. వాడికి మీసాలు ప్రశ్నార్థకమయినట్టుంది. తెల్ల ఆవాల్లో కొన్ని నల్ల ఆవాలను కలబోసినట్టున్న కుచ్చు, బొచ్చు మీసాలను అద్దంలో చూస్తూ సవరించు కొంటున్నాడు. అరవైకి పైబడిన ఆ ఆరడుగుల అందగాడు మీసాలను దువ్వడం చూస్తుంటే జీవితంమీద ఒక సవాలు విసిరినట్టుంది.

"ఒరే! జీవితపోరాటంలో మనిషే కాదు వెంట్రుకలు కూడా అలిసిపోతాయి రా! దానికి గుర్తే తెల్లబడడం. అది సహజం. సహజత్వానికి సిగ్గుపడడం కంటే సిగ్గుపడాల్సిన విషయం మరొకటుండదు. వాటికి రంగులు పులమడం... సుద్దంగా గొరిగిపారేయడం... ప్చ్! అంతకంటే నామోషీ ఇంకొకటుండదు. ఏమంటావ్‌రా పేడిమొహం నా కొడకా!" అంటూ నా భుజం విరిగేటట్టు ఒకదెబ్బ కొట్టాడు పకపకనవ్వుతూ.

వాడు ఎప్పుడూ అంతే. చదువుకునే రోజుల్లో అరిచేతికి వేళ్ళులా అయిదు మంది స్నేహితులు. ఆ అయిదుమందిలో వీడే బొటనవేలు. ఉన్నవాడే కాదు– తెలివున్నవాడు కూడా. ఏడిపించడం నవ్వించడమంటే మహా సరదా వాడికి. కాలం వాడి ఆకారంమీద ఏ కొద్దిగానో పెత్తనం చలాయించ గలిగింది కానీ వాడి ప్రవర్తన జోలికి ఏ మాత్రం పోలేకపోయింది. వయసు పైబడే కొద్దీ మనిషిలో వల్లమాలిన వేదాంత ధోరిణీ నిస్పృహల పొగలు సెగలు కక్కుతుంటాయి. ఆ లక్షణాలేమీ వాడిలో కనిపించలేదు. నున్నంగా గొరుక్కున్న గడ్డాన్ని ఎడమచేత్తో తడుముకుంటూ గత వర్తమానాల మధ్య పడి నలుగుతున్నాను.

నా పేడి ముఖంమీద ఒక విసురు విసిరి నన్నొక దెబ్బ కొట్టేసరికి వాడికి కొంత తృప్తి కలిగిందేమో! నా వైపు తిరిగి పట్టె మంచం మీద కూర్చున్నాడు. బూట్లు విప్పాడు. మేజోళ్ళు విప్పాడు. ఆ మంచం మీదున్న ఒక దిండును చేతికి తీసుకొన్నాడు. ఆ మంచం మీదనే అటు తిరిగి పడుకొన్న ఆమె తలదగ్గర వేశాడు. ఏడంచేయి మోచేతి ఆధారంతో ఆ దిండు మీద వాలాడు. కుడిచేత్తో ఆమెను పొదివి పట్టుకున్నాడు. చెక్కిలి మీద ముద్దు పెట్టుకొన్నాడు.

ఉరవళ్ళు పరవళ్ళు మీదున్న ప్రవాహంలో నిశ్చలంగా నిలబడిన శిలనే అయ్యాను.

రాతికి గుండె లేదు. చూపు అసలే లేదు.

ఆమెను పొదివి పట్టుకొన్న కుడిచేత్తోనే ఆమెను నావైపు తిప్పాడు.

కెవ్వుమని అరవాల్సింది. రాతికి నోరూ ఉండదు.

ఎవడో ఒక మహామాంత్రికుడు కనిపెట్టి పనిబట్టి వాడి శక్తియుక్తులన్నీ ప్రయోగించి పరమ వికారంగా తయారు చేసి ప్రాణప్రతిష్ఠచేసిన పిండిబొమ్మ!

ఆ పిండి బొమ్మ చెవిదగ్గర మూతి పెట్టాడు. "వీడు నా చిన్ననాటి స్నేహితుడు. ఒకే తరగతిలో ఒకే బెంచీమీద కూర్చొని చదువుకున్నాం. భేషజాలకు తావులేని ఆత్మీయతలు మావి. ఇప్పటికీ 'ఒరే తరే!' అని పిలుచుకొంటున్నాం.

వాడు హైదరాబాదు కొస్తే గుర్తుపట్ట గలవా?"

నా రక్తం గడ్డకట్టింది. గుండె చప్పుడు ఆగిపోతుందా? అన్నసందేహం. కనురెప్పలు దోసిళ్లవుతున్నాయి కన్నీళ్ళను పట్టుకోవడానికి.

ఆమె నన్ను చూస్తూ ఉంది. నేనామెను చూస్తున్నాను.

వాడామె తల నిమురుతున్నాడు–

"ఏమమ్మా? వాడు హైదరాబాదు కొస్తే గుర్తుపడతావా?" మరలా అడిగాడు.

"అఁ!" అన్న శబ్దం వినిపించిందే కానీ ఆ పెదవుల్లో ఏమాత్రం చలనం లేదు. కొద్దిగా తెరిచిన నోరు తెరిచినట్టే ఉంది. కనురెప్పలు కర్తవ్యాన్ని మరిచినట్టుంది. పోనీ! కనుపాపలు గుడ్డివైతే కనురెప్పలకు గుర్తింపు ఉండదు. కనుపాపలున్నాయి. అవి నన్ను చూస్తున్నాయి. జీవితానికి చూపు రూపు లేకపోవచ్చు కానీ మనసుకు చూపు ఉంది. ఆ మనసుతో చూస్తున్న చూపులు. అయితే అర్థం కానట్టుగా అయోమయంగా... ఎటో చూస్తూ నన్నే చూస్తున్నట్టుగా!

నా తల వాలిపోయింది.

అంతవరకు ఆ పడక మీద జరిగిన ప్రతి సంఘటన ఒక చెరగని దృశ్యమై నా కండ్ల ముందు మెదులుతూ ఉంది. ఆమె ప్రాణవాయువై వాడి శ్వాస లోపలికి ప్రవేశించి వాడి ఒళ్లంతా అలుముకుంటున్న ఒక అనుభూతి. రెప్పార్చకుండా చూస్తున్నాను.

ఆ దృశ్యాన్ని చెరిపేసే ప్రయత్నంలో ఆ బొమ్మ!... అష్టావక్రాల బొమ్మ!

"ప్రసవం కొంత ఆలస్యమయ్యిందిరా. అయితే మా ఆవిడకు అంతకుముందు రెండు కాన్పులు సహజంగానే జరిగాయి. ఆ కారణంగా ఆ ఆలస్యాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అది ఈ విపరీతానికి దారితీసింది."

తల పైకెత్తాను.

గోముగా వాడామెను తల నిమురుతున్నాడు.

మనసుకు ముఖం దర్పణం. ఆ ముఖ దర్పణంలో మనస్సును చదవడం చాలా తేలిక. నాకు తెలియకనే నా మనసు ఆ ప్రయత్నంలో పడింది.

వాడి మొగం నిండుకు చిరునవ్వుల వెలుగులు. అవే వెలుగులు!... ఆ హోటల్లో ఎన్నో ఏండ్ల తర్వాత అనుకోకుండా నన్ను కలుసుకున్నప్పుడు వాడి మొగంలో వెలిగాయే వెలుగులు!... అవే వెలుగులు!... ఒక వన్నె తగ్గలేదు.

"పెద్దవాడేమో మర్చెంటైల్ షిప్‌లో కేప్టన్. రెండోవాడు మిలిటరీలో మేయర్. ఇద్దరికీ మంచి ఉద్యోగాలే. వాళ్ళు లైఫ్‌లో బాగా సెటిలైనట్టే లెక్క. పెద్దవాడు ఆరునెలల కొకసారి

ఇండియాకొస్తాడు. రెండోవాడు ఏడాదికొకసారి వస్తాడు. ఏదో ఒక పోష్ హోటల్లో పెండ్లాం పిల్లలతో దిగుతారు. ఎప్పుడో వాళ్ళకు తోచినప్పుడు ఇంటికొస్తారు. 'హలో మమ్మీ! హలో డాడీ' అనేసి వెళ్ళిపోతారు." అంటూ పకపక నవ్వాడు.

ఆ నవ్వులో ఈర్ష్య లేదు. అసూయ లేదు. విరక్తి లేదు. వైరాగ్యం అసలే లేదు. అతి సహజంగా అది నా గుండెను తాకింది.

కనురెప్పల వెనుక తడి.

ఆ నవ్వునే పొడిగిస్తూ–

"రెక్కలొచ్చిన పక్షులు గదరా! ఎగరతాయి. వాటి వాటి దారి వాటిదిగా. అదిసహజం. పట్టుకోవాలంటే కుదురుతుందా! మనం మాత్రం ఏం తక్కువ తిన్నామని. పెండ్లాలు పక్కలోకి వచ్చేకుందికి అమ్మా నాన్నను మరిచిపోలా? మామూలే గదా? దానికి కుయ్యో మొర్రో అని మొత్తుకోవడం ఉందే అది కేవలం భ్రమ. కాలం పాఠం నేర్పుతూ ఉంటుంది. నేర్చుకుంటూ ముందుకు పోతూ ఉండాలి. వాళ్ళలా వెళ్ళిపోతారా? ఆ తర్వాత ఏముంది? ఇదో ఈమెతోనే మా జీవితం. అవును గదమ్మా!" అంటూ అడుగుతున్నాడు ఆమె చెంపలను నిమురుతూ.

నిర్జీవమైన ఆ బొమ్మ చూపుల్లో మార్పులేదు. అర్థంలేదు. కనురెప్పల్లో చలనం లేదు. ఏదో చెప్పాలనుకున్నా నోరు సహకరించడం లేదు. నైటీలాంటి గౌన్లో దాక్కొన్న కాళ్ళూ చేతుల్లో కదలిక లేదు. నిస్తేజంగా... నిస్సహాయంగా... మనస్సును అతలాకుతలం చేస్తూ గూడుకట్టిన విషాదంగా...

వాడేమో ఆమెతో ముచ్చటలాడుతూ.

అంతలో తలుపు తెరుచుకున్న శబ్దం. చూపు అటు తిరిగింది. స్నానాలు గదినుంచి బయటకొస్తూ పద్నాలుగు పదిహైదేండ్ల అమ్మాయి. నల్లగా ఉన్నా నాజాగ్గా ఉంది. ఉతికిన బట్టలను ఆరేసే ప్రయత్నంలో పడింది.

"ఈ అమ్మాయేరా మన అమ్మాయికీ కేర్ టేకర్. ఇపుడంటే రిటైరై నేను ఉన్నాననుకో. అప్పుడు? మా ఆవిడకు సహాయంగా ఎవరో ఒక తోడు తప్పదు గదా! ఇంతకుమునుపు ఈ అమ్మాయికి అక్క ఉండేది. ఆడపిల్ల గదా? దానికి యుక్తవయసు రాగానే మేమే పెండ్లి చేశాం. బతికేదానికి ఒక దారి చూపించాం. ఇక ఈ అమ్మాయి ఉంది. దీనికొక మొగుణ్ణి వెదకాలి. పెండ్లిచేయాలి. ఏదో ఒక బతుకు దెరువు చూపాలి"

ఆ అమ్మాయి ముసిముసిగా నవ్వుతూ ఉంది– రంగు రంగుల భవిష్యత్తును కనుల ముందు ఊహించుకుంటూ.

"ఫర్ ది లాస్ట్ ట్వంటీఫైవ్ ఇయర్స్!...

ఇదే పరిస్థితి. ఐతే ఆమె మాటే మాట. అవునంటే అవును. కాదంటే కాదు. ఆమె చెప్తేనే ఏ పనైనా చేయాలి. ఇప్పుడు ఇక్కడినుంచి బయలుదేరా లంటే కూడా ఆమె ఇష్టమే!"

అంతవరకు ఆ పద్నాలుగేండ్ల పడుచు పిల్లకు తగులుకున్న చూపులు ఉన్నట్టుండి వాడివైపు తిరిగాయి.

"అవునురా. ఈమె కోసరం నా ఉద్యోగంలో ప్రమోషన్ కూడా వదులుకొన్నాను. నీకు తెలుసు కదా నేను చేసింది– సన్నాబన్నా ఉద్యోగం కాదని. ప్రమోషన్ మీద డార్జిలింగ్ పొమ్మన్నారు. అమ్మాయి పరిస్థితుల దృష్ట్యా పోలేనన్నాను. తప్పదన్నారు. సుప్రీంకోర్టు కెక్కాను. అక్కడ పరిస్థితి ఒక్క రాగాన తేలుతుందా? హ్హా హ్హా హ్హా! ఈ లోపుగా ముప్పై సంవత్సరాల సర్వీస్ పూర్తయింది. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. ఇదంతా ఈ నా తల్లికోసరమే. అవును గదమ్మా!" అని అడుగుతున్నాడు– ఆ రబ్బరు బొమ్మను.

గుండె చెరువయింది. అల్లకల్లోలంగా కట్టలు తెంచుకుంటే కన్నీటి బలహీనత. ఆ బలహీనత ఎదుటి వ్యక్తిమీద ఎటువంటి ప్రభావానికి దారి తీస్తుందో?

లేచి నిలబడ్డాను.

"ఉండ్రా. ఈ పూట నాతో కలిసి భోంచేద్దువుగానీ..."

కడుపులో చెయ్యేసి కలబెట్టినట్టుంది. ఆ వాతావరణంలో భోజనమా? ముద్ద దిగమన్నా నోట్లోకి దిగుతుందా? ఎపుడెపుడు బయటపడదామా అన్న ఆతురత. ఆ ఆతురతలో అనుకోనట్టుగా ఆ పిండిబొమ్మ మీద చూపు పడింది.

అవేచూపులు!... ఏమీ చేతకాని వాడు ఏమీ చేయలేని నిస్సహాయుడు– బహుశా అలానే చూస్తాడేమో! తల్లికాకి ఏదో నోటికందివ్వబోతే పిల్లకాకి తెరవలేక నోరుతెరచినట్టుగా కొద్దిగా తెరచుకున్న నోరు. అష్టావక్రమైన ఆ నాలుగడుగుల ఆకారాన్ని పిల్లలు చూస్తే జడుసు కుంటారేమో?

ఉన్నట్టుండి వాడు పైకి లేచాడు. నా భుజం మీద చేయి వేశాడు. నా ముఖంలోకి సూటిగా చూస్తూ–

"ఒరే! నాకు మొదట కలిగింది– ఇద్దరూ కొడుకులే. మేమిద్దరం మా కిద్దరని తృప్తి పడుండవచ్చు. కానీ అభిమానం..... ఆదరణ... ప్రేమ ఇవన్నీ ఉన్నాయే అవి ఆడజన్మాల సొత్తురా. కొడుకులు పెండ్లాల కొంగుల పట్టకొని వెళ్ళిపోతారు. అంతో ఇంతో అభిమానంతో ఆదరించేది ఆదరవుగా నిలబడేది ఆడబిడ్డలే. అందుకే ఒక ఆడబిడ్డ కోసం మొక్క గలిగినన్ని దేవుళ్ళకు మొక్కాం. ఆడబిడ్డయితే ఈ జీవితాలకు ఆధారంగా ఉంటుందని. కానీ జీవితాంతం మా ఆధారంతో ఆమె. ఇదేరా జీవితమంటే. అరే! ఏందిరా రే ఆముదం తాగిన ఆ మొగం? ఉంటావా? ఊడతావా? చెప్పి ఏడువు." అని భుజం తట్టి అడుగుతున్నాడు.

"ఉంటున్నావ్ గదా... వస్తాన్లే" అంటూ వాడి మాటకోసరం ఎదురు చూడకుండా ఆ గదినుంచి బయటపడ్డాను.

ఆ ఆరేడంతస్తుల భవనాన్ని ఒక్కనిమిషంలో దిగడానికి వసతి ఉంది. అయినా మనస్సు... శరీరం... చుట్టూ పరిసరాలు– అన్నీ మొద్దుబారినట్లుంది. ఆ వాతావరణంలోకి ఇష్టంగానో

అయిష్టంగానో కూరుకపోతున్నట్లుంది. అవును. ఈ లోకంలో దుఃఖమైన వస్తువు ఏదైనా ఉంటే అది మనిషే. వేరొకటి కాదు. అడుగుమీద అడుగ్గా. చిందర వందరైన మనస్సును మోస్తూ ఒక్కొక్క మెట్టుగా ఒక్కొక్క అంతస్థు- కిందికి దిగుతున్నాను. అయినా ఆ గదిలోనే ఉన్న అనుభూతి.

పట్టుమని పదిపదిహేదు నిమిషాలు నేనుభరించలేని వాతావరణాన్ని ఒకటి కాదు రెండు కాదు. ఇరవైఅయిదు సంవత్సరాలుగా వాడుభరిస్తున్నాడు. భరించడం కాదు తలకెత్తుకొన్నాడు. ఒకబాధ్యతగా కాదు. అదే ఒకభాగ్యంగా. వాడిచుట్టూ విషాదం వాగులై ప్రవహిస్తుంటే అందులో వాడు ఓలలాడు తున్నాడు- వినోదంగా.

నడిసముద్రంలో తనదిక్కును గుర్తించుకొన్న నావికుడు వాడు!

హుం! మనిషికి మనిషికీ మధ్య మనస్సుకు మనస్సుకు మధ్య ఎంత తేడా? ఎందుకుందీ తేడా? ఈ తేడాలకు మూలం? వెదకి పట్టుకోవడానికి సాధ్యమా?

ఆ హోటల్లో లిఫ్ట్ సర్ బుర్రుమని పైకీ కిందికీ దిగితూ ఉంది- నా ఆలోచనల్లా. ఆ లిఫ్ట్‌లో తావు దొరకని వాళ్ళేమో? ఆయాసపడుతూ మెట్లెక్కుతున్నారు. కొందరు చకచక కిందికి దిగుతున్నారు. నేను ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగుతున్నాను- ఆలోచనల నిషాలో తూలుతూ.

వాడిది కలిగిన కుటుంబం. ఒకరి కింత పెట్టిందే కానీ కడుపులు కొట్టలేదు. ఇకవీడా? కల్లాకపటం రెండూ లేని మనిషి. నీతి నిజాయితీలను ప్రాణప్రదగా భావించి కాపాడుకున్న వ్యక్తి. వీడికా ఆ శిక్ష? అదికూడా సటపటమైన శిక్ష కాదే. అవయవలోపం ఉండదు. అంతో ఇంతో చదువు సంధ్య ఉంటుంది. ఇన్ని ఉన్నా ఒక్క ప్రవర్తన సరిగా లేకపోతే ఆ మనిషిని భరించడమే ఒక శిక్ష. అలాంటపుడు కూర్చోబెట్టడానికి... పడుకోబెట్ట డానికి... కాలకృత్యాలు తీర్చడానికి... తినిపించడానికి చలనమే లేని ఆ బొమ్మతో ఏండ్లు పూండ్లుగా యాతన పడడమంటే? అందులో ఆడపుట్టుక. హే భగవాన్! ఈ శిక్ష పగవాడికి కూడా వద్దు!

ఉన్నట్టుండి మనస్సు ప్రస్తుతం నుంచి గతంలోకి వెళ్ళిపోయింది. నాలుగైదు రోజుల కిందట ఏదో పనిమీద ఊరు విడిచి వెళ్ళాను. ఆరోజు తిరిగివస్తున్నాను. తూర్పు దిక్కు పురిట నొప్పులు పడుతూ ఉంది వెలుగును ప్రసవించడానికి. ఆ వేళప్పుడు బస్టాండ్‌లో బస్సు దిగాను. ఇంటికి నడిచి వస్తున్నాను. ఊరు ఇంకా బద్ధకం నుంచి బయటపడలేదు.

బాట ప్రక్కన దృశ్యం కంటపడింది. కాలు ముందుకు కదల్లేదు.

నాలుగైదు కుక్కలు అరుస్తూ ఒకదాని మిందొకటి దూరుతూ కరుస్తూ కండ్లల్లో నిప్పులు కురిపిస్తూ ఆ కుప్పతొట్టి మీద తలపడ్డాయి. పురిటివాసన బాగా వాటి ముక్కుల కెక్కినట్టుంది. పసుపు గుడ్డలో చుట్టిన పసిగుడ్డును బయటికి లాగాయి తనకే దక్కాలన్న ప్రయత్నంలో దేని సామర్థ్యం దానిది. దేని ఆతురత దానిది.

పసుపు గుడ్డ చీలిక పేలికలైనట్టు ఆ పసికందుతల... మొండెము... కాళ్లూ చేతులు- దేనికని విడివిడిగా. వాటిమీద పడి కుక్కలు పీకుతూ. కుప్పతొట్టి చుట్టుపక్కలా నెత్తుటి మయం. దానిమీద ముసురుతూ ఈగలు... ఈ దృశ్యాన్ని లోకానికి చాటే ప్రయత్నంలో గోలచేస్తూ కాకులు!

"అయ్యో పాపం! అక్రమ సంతానాలకు పట్టే గతి ఇంతేనేమో! జీవధాతువు ఒక్కజీవిగా మారే అద్భుతాన్ని మనిషి అవగాహన చేసుకొంటే ఇంత నిర్దయంగా ప్రవర్తించగలడా?" అని ఆలోచిస్తూ వచ్చి అదేమాట మా ఇంటామెతో అంటే-

"అయ్యోరాత! అది గాదే కత. కలిగినింటి కోడలు. కనింది. పుట్టుగుడ్డి. అందులో ఆడపిల్ల. ఎల్లకాలం ఎట్టబ్బా దీంతో ఏగులాడేదని రొండు వడ్లగింజలు నోట్లోయేసి కుప్పతొట్లో పారేసినారంట."

ఒళ్ళు జలదరించింది. అవును మనిషి తన సుఖాలకు ప్రతిబంధక మనిపిస్తే దాన్ని తొలగించుకోవడానికి ఏ మాత్రం వెనుకాడడు. అదే మనిషి స్వభావం. దీనికి భిన్నంగా నడుచు కోవడమే దైవత్వం. అంతేకదా! ఎందుకు కొరగాని జీవి. ఆలోచిస్తే ఎంత ప్రతిబంధకమో? ఆ జీవి కోసరమే వాడు భవిష్యత్తుపై నీళ్లు చల్లుకోవడమే కాదు- ఎన్ని సుఖాలను త్యాగం చేశాడో? ఎన్ని కష్టాలకు తలవంచాడో? ఎంత వేదనను గుట్టుగా భరించాడో?...

అనుభవం వాడిది. ఆలోచన మాత్రమే నాది. ఆలోచనే అనుభవానికొస్తే? గుండె అట్టడుగు పొరలోదడ! అందుకే అనుభవించడం కంటే పాలు పంచుకోవడమే కష్టం. ఇప్పుడు నా అనుభవంలో ఆ కష్టమే. ఆ కష్టానికి సాక్ష్యం చెంపలమీద కారుతున్న కన్నీళ్ళు. ఇంక రెండో మూడో మెట్లు దిగితే ఈ మనుషుల్లో నేనూ ఒక్కడై పోతాను. మనిషికి అర్థం మారిపోతుంది. ఈ జన ప్రవాహంలో పడ్డే ఆ తర్వాత వాడు వాడే. నేను నేనే!

అందుకే ఆ మెట్టు మీద నిలబడి ఒక్కసారి పైకిచూశాను. వాడికీ నాకూ మధ్య వెలుగుకు చీకటికి ఉన్నంత వ్యత్యాసం. దేవుడికీ మనిషికి మధ్య ఉన్నంత దూరం.

హుఁ! దేవుడు దిక్కులేని వాడికి దేవుడే దిక్కని నమ్ముతున్నాడు. మనిషి పూజలు చేస్తున్నాడు. ముడుపులు కడుతున్నాడు. మొక్కులు చెల్లిస్తున్నాడు. అయినా ఆ దేవుడు ఒక దిక్కుగా నిలబడుతున్నాడా? ఏమో వాడికే తెలియాలి. కానీ వీడు?...

"ఏమమ్మా వాడు హైదరాబాదు కొస్తే వాణ్ణి గుర్తుపట్టగలవా?" అని అడగడం నాచెవుల్లో ప్రతిధ్వనిస్తూ వుంది.

"నాన్నా! వాడు నీ చిన్ననాటి స్నేహితుడే కావచ్చు. వాడిముందు నీ జీవితాన్ని ఒక తెరిచిన పుస్తకంగా చేసి చూపించావు. కానీ వాడికా ధైర్యం లేకపోయింది. ఒక్క మగపురుగు కోసరం వరస పెట్టి ముగ్గురు ఆడకూతుర్లని కన్నాడు. ఆ తర్వాత కొడుకు. వాడు పుట్టుకతోనే

ఉన్మాది. మరలా కొడుకు కోసరం ప్రయత్నం చేశాడు. పుట్టపోయేది ఆడపిల్లని తెలిసి దానికి కడుపులోనే సమాధి కట్టాడు. ఇపుడు కొడుకొక కొరకరాని కొయ్య.వీధిలో జగడాలు ఇంట్లోకి. ఇంట్లో వస్తువులు వీధిలోకి. కాదంటే అమ్మకానికి అంగట్లోకి. వాడిని భరించలేకుండా 'అయ్యో! ఈ కొడుకు చస్తే బాగుణ్ణే. వీడికెప్పుడొస్తుందో చావు. బతికి మా బతుకులు చదరం చేస్తున్నాడే. పోతే... ఒక్క దినం ఒక్క ఏడుపుతో పోతుందే పీడ!' అని దినమూ ఏడుస్తున్నాదే? అంత పెద్ద మనిషినే నేను గుర్తుపట్టలేక పోతానా?" అని ఆమె వాడితో చెప్తున్నట్లుంది.

తల గిర్రున తిరిగింది. దిగే ప్రయత్నంలో కాలుజారింది. కింది మెట్టు మీద కూలబడ్డాను. భూమ్యాకాశాల మధ్య ఆ దేవుడు కట్టిన మమతల ఉయ్యాలలో ఆ పిండి బొమ్మ ఊగుతూ... అయోమయంగా... అసహాయంగా కాదు– జీవితమే అర్థమై నట్టుగా నన్నే చూసి పకపక నవ్వుతూ! ●

ఆంధ్రజ్యోతి
(20, మార్చి 1998)